క్లుప్తంగా

నేడు కానూరులో వైద్య శిబిరం

పెనమలూరు: కానూరు మౌంట్‌కార్మెల్ చర్చి ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నామని నిర్వాహకురాలు తాళ్లేరి అశోక్‌శారద తెలిపారు. ఆమె శనివారం వివరాలు తెలుపుతూ..

రక్తదాన శిబిరాన్ని పిన్నమనేని సిద్ధార్థ, మాతృహృదయ్ స్వచ్ఛంద సంస్థ, అశోక్ జిమ్ సహకారంతో నిర్వహిస్తున్నామని తెలిపారు. రక్తదాన శిబిరంతో పాటు పలువురు వైద్య నిపుణులు వివిధ రకాల వైద్య పరీక్షలు కూడా చేస్తారన్నారు. కార్మెల్ చర్చి పుణ్య క్షేత్రం ఫాదర్ సలివేంద్రశౌరి శిబిరాన్ని ప్రారంభిస్తారని తెలిపారు. రక్తదానం, వైద్య పరీక్షలు చేయించుకునే వారు సకాలంలో రావాలి సూచించారు.

జాతీయ స్థాయిలో సత్తా చాటిన విద్యార్థులు



పెనమలూరు: కానూరు పీవీపీ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీలో చదువుతున్న విద్యార్థులు జాతీయ స్థాయి పోటీల్లో మొదటి బహుమతి సాధించి సత్తాచాటారు. కాలేజీలో సివిల్ ఇంజినీరింగ్ చదువుతున్న విద్యార్థులు టీబీ దేవేశ్వర్‌సాయిసింగ్, షేక్ ఆలిమా, జి.రామాంజనేయప్రసాద్ జాతీయ స్థాయిలో చెన్నై అన్నా విశ్వవిద్యాలయంలో ఈ నెల 4వ తేదీన జరిగిన మిక్స్ డిజైన్, క్యూబ్ టెస్టు పోటీల్లో ప్రథమ బహుమతి గెలిచారు. ఈ పోటీని ఇండియన్ కాంక్రీట్ ఇనిస్టిట్యూట్, ఆర్డీసీ కాంక్రీట్ ఇండియా సంయుక్తంగా నిర్వహించారు. సివిల్ విభాగాధిపతి డాక్టర్ వెలగల జగదీష్ మాట్లాడుతూ తమ విద్యార్థులు నైపుణ్యం ప్రదర్శించి జాతీయ వేదికపై సత్తాచాటడం ఆనందంగా ఉందన్నారు. తమ విద్యార్థులు రూ.లక్ష బహుమతి గెలిచారని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కొండపల్లి శివాజీబాబు అభినందించారు.

ఏవో కృష్ణప్రసాద్ బాధ్యతల స్వీకరణ

విజయవాడరూరల్: విజయవాడ మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయం ఏఓగా పి.ఎం.కృష్ణప్రసాద్ శనివారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. జిల్లా పరిషత్ కార్యాలయం నుంచి ఇక్కడకు బదిలీపై వచ్చారు. రూరల్ ఎంపీడీఓ బి.భార్గవి ఆగిరిపల్లి మండలానికి బదిలీకాగా, ఇన్‌చార్జి ఎంపీడీఓగా ఈవోపీఆర్డీ ఎం.వి.దుర్గాప్రసాద్ చార్జి తీసుకున్నారు.

నక్సలైట్ అగ్రనేత రామకృష్ణ పోరంకి వాసే

పెనమలూరు: చత్తీస్‌గఢ్ రాష్ట్రం నారాయణపూర్– దంతెవాడ సరిహద్దులో శుక్రవారం జరిగిన భారీ ఎన్‌కౌంటర్లో మృతి చెందిన నక్సలైట్ అగ్రనేత రామకృష్ణ పోరంకిలో కొంతకాలం ఉన్నారు. ఇప్పటికీ ఆయన బంధువులు పోరంకిలో నివశిస్తున్నారు. రామకృష్ణ తన చిన్నతనంలో పోరంకి తూముల సెంటర్‌లో తల్లితండ్రులతో ఉన్నకాలంలో నక్సలిజంపై ప్రభావితం అయ్యి నక్సలైట్ ఉద్యమంలో చేరాడు. అతను 1994 తరువాత నుంచి ఈ ప్రాంతంలో లేరు. రామకృష్ణకు ఇద్దరు సోదరులు, ఇద్దరు సోదరీమణులు ఉన్నారు. ఒక సోదరుడు నూతక్కిలో, రెండో సోదరుడు మండవల్లిలో ఉంటున్నారు. ఇద్దరూ పాస్టర్లే. ఒక సోదరి పోరంకిలో, మరో సోదరి ఫిరంగిపురంలో ఉంటున్నట్లు తెలిసింది. కాగా రామకృష్ణ మృతి వార్త తెలుసుకున్న పోరంకిలో ఉన్న సోదరి, మేనళ్లుల్లు శనివారం పెనమలూరు పోలీస్‌స్టేషన్‌కు వచ్చి సీఐ వెంకటరమణను కలిశారు. రామకృష్ణ చనిపోయినట్లు తెలిసిందని, ఆయన మృతదేహంపై ఆరా తీశారు. అయితే సీఐ తమకు రామకృష్ణ మరణంపై సమాచారం లేదని, ఏదన్నా సమాచారం వస్తే తెలుపుతామని అన్నారు. అయితే రామకృష్ణ బంధువులు సమాచారం కోసం ఎదురు చూస్తున్నారు.

15 ఏళ్లుగా భవానీ భక్తులకు అన్నదానం



హనుమాన్‌జంక్షన్ రూరల్: దేవీశరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని విజయవాడ దుర్గ గుడికి కాలి నడకన తరలి వెళుతున్న భక్తుల కోసం బాపులపాడు మండలం బొమ్ములూరులో పారిశ్రామిక వేత్త పుట్టగుంట సతీష్ కుమార్ అన్నదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. అమ్మవారికి పూజా కార్యక్రమాలను నిర్వహించి 15వ వార్షిక అన్నదాన శిబిరాన్ని పుట్టగుంట ప్రారంభించారు. ఈ శిబిరంలో ఉదయం, సాయంత్రం అల్పాహారం, మధ్యాహ్న భోజనం ఏర్పాట్లతో పాటుగా వృద్ధులు, మహిళల కోసం ప్రత్యేకంగా విశ్రాంతి, వైద్య సదుపాయాలను కల్పిస్తున్నట్లు ఆయన వివరించారు.



సున్న గ్రామంలో శ్రీదుర్గాదేవి దేవస్థానంలో శ్రీఅన్నపూర్ణాదేవిగా..



యనమలకుదురులో చంద్రఘంటాదేవిగా..



ఉయ్యూరు శ్రీవిజయదుర్గా భవానీ దేవి ఆలయంలో..




ఉయ్యూరు శివాలయంలో గజలక్ష్మీదేవిగా..



చిక్కవరంలో అన్నపూర్ణాదేవి అలంకారంలో అమ్మవారు



శ్రీలక్ష్మీతిరుపతమ్మ ఆలయంలో శ్రీఅన్నపూర్ణాదేవిగా..



పోరంకిలో శ్రీఅన్నపూర్ణాదేవిగా..



రామవరప్పాడులో అన్నపూర్ణాదేవిగా..

మాతా..అన్నపూర్ణేశ్వరీ నమోస్తుతే!

కంకిపాడు: మాతా..అన్నపూర్ణేశ్వరీ..అంటూ భక్తజనం దుర్గమ్మను దర్శించుకుని పూజలు జరిపించారు. దేవీశరన్నవరాత్రుల్లో మూడో రోజైన శనివారం అమ్మవారు అన్నపూర్ణాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. కంకిపాడు శివాలయంలో అన్నపూర్ణాదేవి అలంకారంలో అమ్మ వారు భక్తుల పూజలందుకున్నారు. ప్రొద్దుటూరు శివాలయంలో అన్నపూర్ణాదేవిగా కాశీ అన్నపూర్ణాదేవి దర్శనమిచ్చారు. పట్టణంలోని ఆర్యవైశ్య ప్రార్థనామందిరంలో వాసవీకన్యకా పరమేశ్వరీ అమ్మవారు గజలక్ష్మీదేవిగా పూజలందుకున్నారు. ఉప్పలూరు, ఈడుపుగల్లు, మద్దూరు, మంతెన గ్రామాల్లోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

విజయవాడరూరల్: విజయవాడ రూరల్ మండలంలో శనివారం నున్న గ్రామం చెరువు సెంటర్లోని శ్రీదుర్గాదేవి దేవస్థానంలో అమ్మవారు శ్రీఅన్నపూర్ణాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. చంద్రశేఖరేంద్ర సరస్వతీస్వామి దేవస్థానం చినకంచిలో శ్రీకామాక్షి అమ్మవారు శ్రీఅన్నపూర్ణాదేవిగా దర్శనమివ్వగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు కుంకమపూజలు నిర్వహించారు. శ్రీషిర్డీ సాయిబాబా మందిరంలో అమ్మవారు శ్రీఅన్నపూర్ణా దేవిగా దర్శనమిచ్చారు. శ్రీకాశీవిశ్వేశ్వరస్వామి, శ్రీరామలింగేశ్వరస్వామి దేవస్థానాల్లో అమ్మవారికి శ్రీఅన్నపూర్ణాదేవిగా అలంకారం చేసి ప్రత్యేక పూజలు చేశారు. బోడపాడు గ్రామంలోని శ్రీగంగానమ్మ దేవస్థానంలో అమ్మవారిని శ్రీఅన్నపూర్ణా దేవిగా అలంకారం చేశారు. విలేజి కంద్రికలో యాదవుల బజారు, శ్రీకోదండ రామాలయంలో అమ్మవారిని శ్రీఅన్నపూర్ణా దేవిగా అలంకారం చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పి.నైనవరం గ్రామం శ్రీ శివనాగేంద్ర స్వామి దేవస్థానంలో అమ్మవారిని శ్రీఅన్నపూర్ణా దేవిగా అలంకారం చేసి ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు.



కంకిపాడు శివాలయంలో అన్నపూర్ణాదేవిగా అమ్మవారు

కంకిపాడు: ప్రొద్దుటూరు శివారు గాయత్రీవిహార్‌లోని ధ్యాన యోగ సాయి మందిరంలో మూడో రోజైన శనివారం అమ్మవారు శ్రీఅన్నపూర్ణాదేవిగా భక్తులకు దర్శనమిచ్చి పూజలందుకున్నారు. గాయత్రీ విహార్ అసోసియేషన్ భక్త బృందం అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేయించారు.

పెనమలూరు: మండల పరిధి యనమలకుదురులో శ్రీ కనకదుర్గ అమ్మవారి ఆలయంలో అమ్మవారిని శనివారం శ్రీ అన్నపూర్ణదేవి అలంకరణ చేశారు. పోరంకి శ్రీషిరిడి సాయిబాబా మందిరంలో భక్తులు కుంకుమ పూజలు చేశారు. యనమలకుదురు గ్రామంలో శ్రీపార్వతీ సమేత శ్రీ రామలింగేశ్వరస్వామివారి దేవస్థానంలో అమ్మవారిని చంద్రఘంటాదేవిగా అలంకరించారు. భక్తులు సామూహిక కుంకుమార్చనలు చేశారు. భక్తులు తీర్థప్రసాదాలు స్వీకరించారు. పెదపులిపాక గ్రామంలో శ్రీ విజయరాజరాజేశ్వరి ఆలయంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులు పూజలు నిర్వహించారు.

ఉయ్యూరు: దసరా ఉత్సవాల్లో మూడో రోజైన శనివారం అమ్మవారు అన్నపూర్ణాదేవిగా భక్తులకు



ప్రొద్దుటూరు శివారు గాయత్రీ విహార్‌లో అమ్మవారికి పూజలు చేస్తున్న మహిళలు

దర్శనమిచ్చి పూజలందుకున్నారు. మాతాకృపాసాగరీ..నిత్యాన్నదానేశ్వరీ..కాశీ పురాధీశ్వరీ..మాతాన్నపూర్ణేశ్వరీ అంటూ భక్తజనం అన్నపూర్ణాదేవిగా దర్శనమిచ్చిన అమ్మవారికి విశేష పూజలు జరిపించారు. ఉయ్యూరు శ్రీవిజయ దుర్గాభవానీదేవి ఆలయంలో అన్నపూర్ణాదేవిగా, శివాలయంలోని జగదాంబదేవీ శ్రీగజలక్ష్మీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.



ఆత్కూరులో పూజలు నిర్వహిస్తున్న మాజీ వైస్ ఎంపీపీ దంపతులు

గన్నవరం: స్థానిక శ్రీలక్ష్మీతిరుపతమ్మ ఆలయంలో శనివారం అమ్మవారు శ్రీఅన్నపూర్ణదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. స్థానిక శ్రీగాయత్రి మందిరంలో శ్రీఅన్నపూర్ణ హోమం, పూజలు నిర్వహించారు. శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానంలో శ్రీగాయత్రిదేవిగా అమ్మవారిని అలంకరించారు. స్థానిక మదర్‌థెరిస్సా కాలనీలో శ్రీపెద్దమ్మతల్లి ఆలయంలో అమ్మవారికి పూజలు చేశారు. స్థానిక శ్రీకనకదుర్గమ్మ ఆలయం, శ్రీభువనేశ్వరి పీఠం, దావాజిగూడెంలోని శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానం, బుద్ధవరం, అల్లాపురం, కేసరపల్లి గ్రామాల్లో శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి.

గన్నవరం రూరల్: దసరా శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా శ్రీ కనకదుర్గ అమ్మవారు శనివారం అన్నపూర్ణాదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. పురుషోత్తపట్నం శివాలయం, కొండపై శ్రీ భువనేశ్వరీ మాత ఆలయం, ముస్తాబాద శివాలయం, చిక్కవరం శ్రీ కోదండ రామాలయం ఆలయాల్లో అమ్మవారిని అన్నపూర్ణాదేవిగా అలంకరించి భక్తులు దర్శించారు. చిక్కవరం శ్రీక్షేత్ర హనుమత్‌పురంలో శ్రీ మంగళ గౌరి దేవీ అన్నపూర్ణా దేవి అలంకారంలో భక్తులు పూజించారు.

రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం రామవరప్పాడు శ్రీ వెంకమ్మ పేరంటాలమ్మ ఆలయంలో శనివారం అమ్మవార్లు శ్రీ అన్నపూర్ణదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. సాయంత్రం నాట్యాచార జోష్యుల శ్రీ రామచంద్రమూర్తి బృందంచే ప్రదర్శించిన భరత నాట్య జానపద నృత్యం వీక్షకులను ఆకట్టుకుంది. ఈ సందర్భంగా ఆలయ కార్యనిర్వహణాధికారి పి.ప్రియాంక మాట్లాడుతూ భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆలయంలో వసతులు కల్పించినట్లు వివరించారు.

ఉంగుటూరు: మండలంలోని ఆత్కూరులో కనకదుర్గ అమ్మవారి దేవస్థానంలో అమ్మవారు అన్నపూర్ణాదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. మాజీ వైస్‌ఎంపీపీ ఆర్నేపల్లి సింహాచలం, శివలక్ష్మి దంపతులు పూజలు చేశారు. దేవాలయ అర్చకులు ప్రతాప లక్ష్మీనారాయణ శాస్త్రి, మౌళీకుమార్ శాస్త్రి విశేష పూజలు చేశారు. పొట్టిపాడు, పెద్ద అవుటపల్లి, తేలప్రోలు, మానికొండ, తదితర గ్రామాల్లో అమ్మవారిని వివిధ అలంకారాల్లో భక్తులు పూజలు చేశారు.



కంకిపాడు ఆర్యవైశ్య ప్రార్థనామందిరంలో గజలక్ష్మీదేవిగా అమ్మవారు



ప్రొద్దుటూరు శివాలయంలో అన్నపూర్ణాదేవిగా..

మహిళలకు చట్టాలపై అవగాహన అవసరం

ఉయ్యూరు జూనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి శ్రీహరి

ఉయ్యూరు: మహిళలు చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలని ఉయ్యూరు జూనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి కె.శ్రీహరి అన్నారు. పట్టణంలోని కేసీపీ ఆడిటోరియంలో జాతీయ మహిళా కమిషన్, జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో 'విధాన్ సే సమాధాన్' (మహిళా న్యాయ విజ్ఞాన సదస్సు) శనివారం నిర్వహించారు. న్యాయమూర్తి కె.శ్రీహరి మాట్లాడుతూ మహిళలు చట్టాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. మహిళల హక్కులు, చట్టాలపై అవగాహన కల్పించారు. మహిళా న్యాయవాదులు పల్లవి, ధనలక్ష్మి, దివ్యాంజలి, గీతాంజలి మాట్లాడుతూ వరకట్న వేధింపులు, పరిష్కారాలు, గృహ హింస నిరోధక చట్టం, లైంగికవేధింపులు వంటి అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కాగిత గోపిచంద్, ప్రధాన కార్యదర్శి శ్రీకృష్ణకుమార్, సీనియర్ న్యాయవాది మోర్ల అంక శ్రీనివాసరావు పాల్గొన్నారు.



మహిళకు బహుమతి అందజేస్తున్న న్యాయమూర్తి శ్రీహరి

నున్న పొలాలను ముంపు బెడద నుంచి రక్షించండి

విజయవాడరూరల్: విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ ప్రాంతాలైన కంద్రిక, రాజీవ్‌నగర్, ఎన్‌ఎస్‌సీ బోస్ నగర్‌ల నుంచి వరద నీటిని దిగువకు అధికారులు వదలడం వలన నున్న గ్రామానికి చెందిన పంట పొలాలు ముంపునకు గురవుతున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల వచ్చిన బుడమేరు వరదల్లో డీమార్ట్, శ్రీసిటీ, దుర్గాడైరీ ప్రాంతాల నుంచి వరద నీటిని అధికారులు నూజివీడు ఆర్అండ్‌బీ రోడ్డుకు గండ్లుపెట్టి మరీ నున్న పొలాల వైపునకు వదిలారన్నారు. ఆ నీరు ఇప్పటికీ పొలాల వైపు పారుదల అవుతూ ముంపులోనే ఉన్నాయని గ్రామానికి చెందిన కలకోటి శ్రీనివాసరెడ్డి, మరికొందరు రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికీ ఆర్అండ్‌బీ రోడ్డు కింద భాగంలో తూములు ఏర్పాటు చేసి గండ్లు పూడ్చడం జరుగుతుందని, భవిష్యత్‌లో వరదలు ఎప్పుడు వచ్చినా నున్న గ్రామంలోని పంట పొలాలను, స్కూల్స్, ఇళ్లను ముంచెత్తే ప్రమాదం ఉందని, విజయవాడ నగర పాలక సంస్థ కంద్రిక ప్రాంతాల నుంచి వచ్చే నీటిని ప్రత్యామ్నాయ మార్గం ద్వారా పంపాలని కోరారు. ఆర్అండ్‌బీ రోడ్డుకు ఇరు వైపులా డ్రెయినేజీ కాల్వ నిర్మించి వీఎంసీ ప్రాంతాల నుంచి వచ్చే డ్రెయినేజీ నీటిని, వర్షాలు కురిసి వరదలు వచ్చినప్పుడు నున్న పొలాలకు రాకుండా అవుట్ పాల్ డ్రెయిన్‌లోకి వెళ్లే విధంగా ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఎస్.ఢిల్లీరావు జిల్లా కలెక్టర్‌గా ఉండగా ఇదే సమస్యపై స్పందన కార్యక్రమంలో నున్న గ్రామ రైతులు విజ్ఞప్తి చేసినా అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టలేదన్నారు. వీఎంసీ అధికారులు రైతుల సమస్యకు పరిష్కారం చూపాలని కోరుతున్నారు.



నున్న పొలాల ముంపునకు కారణమవుతున్న గండి (ఫైల్)

అక్రమ ఇసుక దందాపై చర్యలు తీసుకోవాలి

వైఎస్సార్ సీపీ పెనమలూరు సమన్వయకర్త దేవభక్తుని చక్రవర్తి డిమాండ్

పెనమలూరు: పెనమలూరు మండల పరిధిలో యనమలకుదురు, పెదపులిపాక గ్రామాలలో టీడీపీ నేతలు చేస్తున్న అక్రమ ఇసుక దందాపై ఉన్నతాధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని పెనమలూరు వైఎస్సార్ సీపీ సమన్వయకర్త దేవభక్తుని చక్రవర్తి డిమాండ్ చేశారు. ఆయన శనివారం మాట్లాడుతూ ఎమ్మెల్యే బోడె ప్రసాద్ సారధ్యంలో అక్రమ ఇసుక దందా టీడీపీ నేతలు చేస్తున్నారని ఆరోపించారు. రూ.కోట్ల విలువ చేసే సహజ సంపదను దోచుకుంటున్నారని ఆరోపించారు. స్థానిక అధికారులు, పోలీసులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించటం దారుణమన్నారు. యనమలకుదురులో ఇసుక ట్రాక్టర్లు మితిమీరిన వేగంగా వెళ్లటం వలన గ్రామస్తులు భయభ్రాంతులవున్నారని అన్నారు. ఇసుక మాఫియా గ్రామస్తులను బెదిరిస్తున్నారని, దీని వలన గ్రామంలో శాంతి భద్రతలకు భంగం వాటిల్లే ప్రమాదం ఉందన్నారు. తహసీల్దార్, పెనమలూరు సీఐకి ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోలేదని అన్నారు. నిషేధంలో ఉన్న ఇసుక క్వారీలో అక్రంగా ఇసుక తవ్వకాలు చేస్తుంటే ఇంతకంటే దారుణం మరొకటి ఉందా అని ప్రశ్నించారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించక పోతే వైఎస్సార్ సీపీ ప్రత్యక్ష ఆందోళన చేపడుతుందని ఆయన హెచ్చరించారు.




విద్యను నిర్లక్ష్యం చేస్తున్న ప్రభుత్వం

అగ్రిబోర్డు మాజీ చైర్మన్ నత్తా వెంకటేశ్వరరావు

కంకిపాడు: విద్యను నిర్లక్ష్యం చేసేలా కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తోందని అగ్రిబోర్డు మాజీ చైర్మన్, దళిత ఉద్యోగ సంఘాల జిల్లా నేత నత్తా వెంకటేశ్వరరావు ఆరోపించారు. కంకిపాడులో శనివారం విలేకరుల సమావేశంలో వెంకటేశ్వరరావు మాట్లాడారు. బలహీన వర్గాలు, ఎస్సీ కాలనీల్లో ఉన్న మండల పరిషత్ పాఠశాలల్లో ఏకోపాధ్యాయులతోనే బోధన సాగిస్తున్నారన్నారు. దీనివల్ల ఆయా వర్గాలకు చెందిన విద్యార్థులకు సమగ్ర విద్య అందటం లేదన్నారు. విద్య అందించే విషయంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. బలహీన వర్గాలు, ఎస్సీ కాలనీల్లోని ఎంపీపీ పాఠశాలల్లో ఇద్దరు చొప్పున ఉపాధ్యాయులను నియమించి విద్య సమర్థంగా అందేలా చూడాలని డిమాండ్ చేశారు. స్వాతంత్ర్యం వచ్చినా దళితులకు మాత్రం రాజ్యాధికారం అందటం లేదన్నారు. దళితులను గౌరవిస్తూ ప్రముఖ దేవాలయాల్లో చైర్మన్ అవకాశాలను హిందూ దళితులకు అందించాలని కోరారు. పాలకులు ఎవరున్నా ఓటు బ్యాంకుగా చూడటం మానాలని, దళితులకు అన్నింటా అవకాశాలు కల్పించి అభివృద్ధి చెందేలా చూడాలని డిమాండ్ చేశారు.

ప్రమాదకరంగా వన్నేరు వంతెన



శిథిలావస్థలో వన్నేరు వంతెన



వంతెనపై ధ్వంసమైన ఇనుప రెయిలింగ్

- ధ్వంసమైన రక్షణ గోడలు
- కూలేందుకు సిద్ధంగా ఉన్న ఇనుప రెయిలింగ్
- బిక్కుబిక్కుమంటూ ప్రజల రాకపోకలు

కంకిపాడు: వన్నేరుపై వంతెన ప్రమాదకరంగా తయారైంది. వంతెన నిర్మించి ఏళ్లు గడిచిపోవటంతో పునాదులు కదిలిపోతున్నాయి. రక్షణగోడలు ధ్వంసమయ్యాయి. రాకపోకల భద్రత రీత్యా ఏర్పాటుచేసిన ఇనుప రెయిలింగ్ కూడా కూలేందుకు సిద్ధంగా ఉంది. ఇటీవల సంభవించిన వరదలతో వన్నేరు పొంగి పొర్లటంతో వంతెన పూర్తిగా దెబ్బతింది. దీంతో బిక్కు బిక్కు మంటూ ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారు.

మండలంలోని ఉప్పలూరు పరిసరాల నుంచి వచ్చే వన్నేరు డ్రెయిను తెన్నేరు ప్రధాన గ్రామం నుంచి ప్రవహిస్తుంది. గ్రామంలోకి వెళ్లే ప్రధాన రహదారిని వన్నేరు డ్రెయిను మీదుగా నిర్మించారు. ప్రస్తుతం వంతెన శిథిలావస్థకు చేరుకుంది. వంతెనకు ఇరువైపులా నిర్మించిన రక్షణగోడలు ధ్వంసమైపోయాయి. వంతెన ఇనుప రెయిలింగ్ కూడా కదిలిపోయి ఎప్పుడు కూలిపోతుందో? అన్న పరిస్థితి నెలకొంది. ఇటీవల వరదనీటి ప్రవాహంతో వన్నేరు డ్రెయిను పొంగిపొర్లింది. వంతెన రెయిలింగ్, పునాదులు కదిలి ధ్వంసమయ్యాయి.

వంతెన నిర్మాణం చేపట్టాలి

నిత్యం గ్రామానికి ఆర్టీసీ బస్సు సర్వీసులు, స్కూల్ బస్సులు, ఇతర ప్రైవేటు వాహనాలు, భారీ వాహనాలు ఈ వన్నేరు డ్రెయినే వంతెన మీదుగా రాకపోకలు సాగిస్తున్నాయి. వంతెన ప్రమాదకరంగా మారటంతో ఎప్పుడు ఏం జరుగుతుందోనన్న భయం స్థానికులను వెంటాడుతోంది. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి వంతెన పునర్నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

దోమల నిర్మూలనకు ప్రత్యేక డ్రైవ్



కంకిపాడు: దోమల నిర్మూలనకు ప్రత్యేక డ్రైవ్ చేపడుతున్నట్లు కంకిపాడు పంచాయతీ కార్యదర్శి సాంబశివరావు, మలేరియా సబ్‌యూనిట్ అధికారి జి.శ్రీనివాసరావు తెలిపారు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో దోమల సమస్యను పరిష్కరించేందుకు దోమల మందు పిచికారీ పనులను శనివారం చేపట్టారు. సాంబశివరావు, శ్రీనివాసరావు మాట్లాడుతూ డ్రెయిన్లలో పూడికతీతలు, మురుగు పారుదలకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, డ్రెయిన్లలో వ్యర్థాలను వేయవద్దని సూచించారు. మురుగునీరు నిలిచిన ప్రాంతాల్లో ఎబేట్ ద్రావణాన్ని పిచికారీ చేయిస్తున్నామన్నారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ రామారావు, హెల్త్ అసిస్టెంట్ శ్రీధర్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.